జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 30 | జూన్ | 2026 | పేజీలు : 6

# ఎస్ఐఆర్‌లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్

- ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ



**ములకలపల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను

మిగతా 2 లో...

- నిశ్శబ్దం వీడిన సింగరేణి అధికారులు.. • చరిత్రలో తొలిసారిగా రిలే నిరాహార దీక్షలు... • పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ, పదోన్నతుల కోసం పోరు • కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపిన అధికారులే నేడు తమ సమస్యలపై ఉద్యమబాట... • యాజమాన్యం వైఖరిపై పెరుగుతున్న అసంతృప్తి.. • మద్దతు పలికిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమెల్యే కూనంనేని సాంబశివరావు

# తాడోపేడో తేల్చుకోవాల్సిందే..!

6 లో..






137 ఏళ్ళ సింగరేణి చరిత్రలో కార్మిక ఉద్యమాలు కొత్తకాదు. వేతన ఒప్పందాలు, బోనస్‌లు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల కోసం కార్మిక సంఘాలు ఎన్నోసార్లు ఆందోళనలకు దిగాయి. కానీ సంస్థ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే అధికారులే తమ హక్కుల కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టడం మాత్రం ఇదే తొలిసారి. దీంతో ఈ పరిణామం సింగరేణిలో మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరిపి పరిష్కారానికి వారధిగా నిలిచిన అధికారులే నేడు తమ సమస్యల పరిష్కారం కోసం “తాడో పేడో తేల్చుకోవాల్సిందే..” అన్న రీతిలో సంస్థ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఓఎఐ) అధ్వర్యంలో ఆయా కార్యాలయల ఎదుట నిరాహార దీక్షలకు దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# నక్సలైట్ల ఆయుధ కర్మాగారం ధ్వంసం



**చర్ల, జూన్ 29 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్గఢ్ –మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలు ఒక పెద్ద విజయాన్ని సాధించాయి. గడ్చిరోలి జిల్లాలోని దట్టమైన అడవులలో నక్సలైట్లు దాచిపెట్టిన ఆయుధ తయారీ కర్మాగారాన్ని భద్రతా దళాలు ధ్వంసం చేశాయి . ఈ సంయుక్త ఆపరేషన్‌లో, గడ్చిరోలి పోలీసులు, సీఆర్పీఎఫ్ భారీ పరిమాణంలో ఆయుధ తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని, అక్కడికక్కడే ధ్వంసం చేశారు. జూన్ 22 నుండి జూన్ 27, 2026 మధ్య నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. ఆపరేషన్ చివరి రోజైన జూన్ 27న, అందిన రహస్య సమాచారం ఆధారంగా భద్రతా దళాలు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో భూగర్భంలో దాచిపెట్టిన నక్సలైట్ల ఆయుధ తయారీ కేంద్రాన్ని కనుగొన్నారు.భద్రతా దళాలు సంఘటనా స్థలం నుండి భారీ పరిమాణంలో ఆయుధాల తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో సుమారు 5 నుండి 6 టన్నుల బరువున్న ఒక లేత్ యంత్రం, 150 క్లాంపులు, వివిధ రకాల పైపులు, 220–బోర్ పైపులు, 20 ఇనుప కడ్డీలు , ఇతర ఆయుధాల తయారీ పరికరాలు ఉన్నాయి. నక్సలైట్లు ఆయుధాలు పేలుడు పదార్థాలను తయారు చేయడానికి వీలుగా ఈ సామాగ్రిని అడవి లోపల చాలా జాగ్రత్తగా

మిగతా 2 లో...

# ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈఈ

- రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారి
- దొంతికుంట చెరువు నుంచి రైతు పొలానికి మట్టి తరలింపునకు అనుమతి పేరుతో డిమాండ్...
- ఉచ్చుపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 2, ప్రజాజ్యోతి :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుస దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)

మిగతా 2 లో...

# కోల్‌బెల్ట్‌కు... గుండె ధైర్యం...

2 లో..



- గోదావరిఖనిలో తొలి క్యాథ్ ల్యాబ్ సిద్ధం.. • 'గోల్డెన్ అవర్'లోనే గుండెపోటు బాధితులకు అత్యవసర చికిత్స.. • కార్మికులు, కుటుంబ సభ్యులతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు

## ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈఈ

(మొదటి పేజీ తరువాయి...)

ఎల్. శ్రీనివాస్ రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... అశ్వారావుపేట మండలంలోని దొంతికుంట చెరువు నుంచి తన వ్యవసాయ భూమికి మట్టి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని ఓ రైతు ఇరిగేషన్ అధికారులను ఆశ్రయించాడు. అనుమతి మంజూరు చేయడానికి ఏఈఈ ఎల్. శ్రీనివాస్ రూ.2 లక్షలు లంచంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధిత రైతు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. సోమవారం అశ్వారావుపేటలోని ఇరిగేషన్ కార్యాలయంలో రైతు నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్‌నేతృత్వంలోని బృందం ఆకస్మికంగా దాడి చేసి ఏఈఈ శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం కేసు నమోదు చేసి నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా, ఇదే రైతు గతంలో విద్యుత్ శాఖకు చెందిన ఓ అధికారిని కూడా ఏసీబీకి పట్టించినట్లు సమాచారం. తాజాగా ఇరిగేషన్ శాఖ అధికారిని కూడా అవినీతి నిరోధక శాఖకు చిక్కేలా చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పాల్గొన్నారు.

## నక్సలైట్ల ఆయుధ కర్మాగారం ధ్వంసం



(మొదటి పేజీ తరువాయి...)

దాచిపెట్టారు అని అధికారులు అన్నారు. నక్సలైట్ల ఆయుధాల తయారీకి సిద్ధం కావడానికి అటవీ ప్రాంతాల్లోని ఇటువంటి రహస్య స్థావరాలను చాలా కాలంగా ఉపయోగిస్తున్నారు అని ఈ రహస్య స్థావరం ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులోని దట్టమైన దుర్గమమైన అటవీ ప్రాంతంలో ఉండటంతో దీనిని గుర్తించడం అత్యంత కష్టంగా మారింది ఆపరేషన్ సందర్భంగా భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని మొత్తం సోదా చేసి అనుమానాస్పద వస్తువులను ఒక్కొక్కటిగా తొలగించాయి. స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలించిన అనంతరం వాటిని తిరిగి ఉపయోగించకుండా అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్ లో నక్సలైట్ లాజిస్టిక్స్ నెట్ వర్క్‌కు , ఆయుధాల తయారీ సామర్థ్యాలకు పెద్ద దెబ్బ అని ఇది వారి కార్యకలాపాలను తీవ్రంగా దెబ్బతీసి వారి ఆయుధ సరఫరా నెట్‌వర్క్‌కు పెద్ద దెబ్బ కొట్టింది అని నక్సలైట్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించడానికి ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. భద్రతా దళాల ఈ చర్య ఆ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలను నియంత్రించడంలో సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## ఎస్ఐఆర్‌లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)

ఆదేశించారు. సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన ఆయన, బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించి, ప్రతి అర్హ ఓటరుకు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వార్డులు, ఫార్మసీ, ఔషధ నిల్వలు, రక్త పరీక్షల విభాగం, సిబ్బంది హాజరునుప్ పరిశీలించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు అవసరమైన మందులు, పరీక్షా కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ స్వాతి బిందు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, మెడికల్ సిబ్బంది ఇమ్రాన్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌బెల్ట్‌కు... గుండె ధైర్యం...



- గోదావరిఖనిలో తొలి క్యాథ్ ల్యాబ్ సిద్ధం..
- 'గోల్డెన్ అవర్'లోనే గుండెపోటు బాధితులకు అత్యవసర చికిత్స..
- కార్మికులు, కుటుంబ సభ్యులతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 29, ప్రజాజ్యోతి :** కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. గుండెపోటు వచ్చిన రోగులకు చికిత్సలో అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్'లోనే వైద్యం అందించాలనే లక్ష్యంతో సింగరేణి సంస్థ గోదావరిఖని రామగుండం-1 ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏడాదిలోనే ఈ కేంద్రాన్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఈ క్యాథ్ ల్యాబ్ అందుబాటులోకి రావడంతో గుండెపోటు బాధితులను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలకు తరలించాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుండగా, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలకు ప్రాణాలను కాపాడే అత్యవసర గుండె వైద్యం స్థానికంగానే అందుబాటులోకి రానుంది.

### క్యాథ్ ల్యాబ్ విశేషాలు..

- గోదావరిఖని రామగుండం-1 ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు
- సుమారు 7,890 చదరపు అడుగుల విస్తీర్ణం
- 5 పడకల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్
- 10 పడకల ఐసీయూ
- యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక సేవలు
- నెలకు సుమారు 3,000 మంది వరకు సేవలు
- ఏడేళ్లలో సుమారు రూ.50 కోట్ల వ్యయం
- సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు 50 శాతం పడకల రిజర్వేషన్
- ఉత్తర తెలంగాణ కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు కూడా వైద్య సేవలు

### »» 'గోల్డెన్ అవర్'లో చికిత్సే ప్రాణ రక్షణ


గుండెపోటు వచ్చిన తొలి గంటను వైద్య నిపుణులు 'గోల్డెన్ అవర్'గా పేర్కొంటారు. ఈ సమయంలో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక వంటి చికిత్సలు అందితే రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఇప్పటివరకు కోల్‌బెల్ట్ ప్రాంతాల నుంచి రోగులను ఇతర నగరాలకు తరలించాల్సి రావడంతో ఈ విలువైన సమయం వృథా అవుతుండేది. ఆ లోటును భర్తీ చేయాలనే లక్ష్యంతో సింగరేణి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. అందుకే సింగరేణి ఉద్యోగులు అత్యధికంగా నివసించే గోదావరిఖని ప్రాంతాన్ని కేంద్రంగా ఎంపిక చేసి ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల సుమారు 33 వేల మంది సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులతో పాటు పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రజలు కూడా నేరుగా ప్రయోజనం పొందనున్నారు. ఇప్పటివరకు గుండె సంబంధిత అత్యవసర చికిత్స కోసం సుదూర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, ఇకపై అదే సేవలు గోదావరిఖనిలోనే అందుబాటులోకి రావడం ఉత్తర తెలంగాణకు కీలక ఆరోగ్య మౌలిక సదుపాయంగా మారనుంది.

### »» రూ.50 కోట్లతో ఆధునిక వైద్య సదుపాయం

గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో సుమారు 7,890 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కార్డియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఐదు పడకల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్, పది పడకల ఐసీయూ, ప్రత్యేక ఔట్‌పేషెంట్ విభాగం, అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టుపై ఏడేళ్లలో సింగరేణి దాదాపు రూ.50 కోట్లు వ్యయం చేయనుండగా, ఏడాదికి సుమారు రూ.6 కోట్ల నిర్వహణ వ్యయం అయ్యే అవకాశం ఉందని సంస్థ అంచనా వేస్తోంది. ఈ కేంద్రం ద్వారా ప్రతి నెల సుమారు మూడు వేల మంది వరకు గుండె వైద్య సేవలు పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుబాటులో ఉన్న పడకల్లో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులకు కేటాయించనుండగా, మిగిలిన సేవలను సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్‌ఎస్) టారిఫ్‌ల మేరకు స్థానిక ప్రజలకు కూడా అందించనున్నారు. దీంతో ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం తక్కువ ఖర్చుతో అత్యాధునిక గుండె వైద్యం అందుబాటులోకి రానుంది.

### »» కార్మికుడి ఆరోగ్యానికి సింగరేణి ప్రాధాన్యం..

సింగరేణి సంస్థ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఏడాది రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. గత ఏడాది మాత్రమే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న సుమారు మూడు వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసింది. అయితే గుండెపోటు చికిత్సలో ప్రతి నిమిషం కీలకం కావడంతో స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. ఈ క్యాథ్ ల్యాబ్‌లో గుండె రక్తనాళాల పరీక్షలు, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక, ఇతర ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ సేవలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ద్వారా నిరంతర వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ అంశం సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ క్యాథ్ ల్యాబ్ ద్వారా గుండెపోటు బాధితులకు 'గోల్డెన్ అవర్'లోనే చికిత్స అందించి వేలాది మంది ప్రాణాలను కాపాడే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఇకపై కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ గుండె వైద్యం కోసం సుదూర నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.



# నత్తనడకన అండర్ రైల్వే బ్రిడ్జి పనులు..!

- దారి మళ్లించిన వాహనాలు... పెరిగిన ప్రజల కష్టాలు
- వారం గడిచినా ఆశించిన పురోగతి లేదు
- 45 రోజుల్లో పనులు పూర్తవుతాయా..?
- అధికారుల తీరుపై విమర్శలు





**లక్ష్మీ దేవిపల్లి జూన్ 29 ప్రజాజ్యోతి** కొత్తగూడెం–ఇల్లందు జాతీయ రహదారిపై అనిశెట్టిపల్లి సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండటంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. బ్రిడ్జిలో పగుళ్లు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో అధికారులు భారీ వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లిస్తూ మరమ్మతు పనులు ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించి వారం రోజులు దాటుతున్నా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించకపోవడంతో అధికారులు కేవలం ట్రాఫిక్ మళ్లింపుకే పరిమితమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. బ్రిడ్జి పనులు అత్యవసరమని ప్రకటించిన అధికారులు ప్రారంభంలోనే 45 రోజుల్లో పూర్తి చేస్తామని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రస్తుతం పనుల వేగాన్ని చూస్తే ఆ గడువు నాటికి పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ పనిచేస్తున్న కార్మికులే ఇంకా రెండు నెలల వరకు సమయం పట్టే అవకాశముందని చెబుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

### ››› ప్రత్యామ్నాయ రోడ్లపై తీవ్ర ఒత్తిడి....

బ్రిడ్జి మూసివేతతో ఇల్లందు వెళ్లే ప్రధాన రహదారిని పూర్తిగా నిలిపివేసి వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేయగా కారుకొండ క్రాస్ రోడ్డు, అనిశెట్టిపల్లి ప్రాంతాల్లోనూ భారీ గేట్లు ఏర్పాటు చేసి వాహనాల ప్రవేశాన్ని నియంత్రిస్తున్నారు. దీంతో కొత్తగూడెం పోస్టాఫీస్ మీదుగా కారుకొండ–రామవరం రోడ్డు, మెయిన్ ఆస్పత్రి–సాటివారిగూడెం–నవభారత్ మార్గాలపై భారీ వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఈ రోడ్లు ఇప్పటికే ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ లారీల రాకపోకలతో రోడ్లు వేగంగా దెబ్బతింటున్నాయని ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ››› ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు....

ప్రతిరోజూ వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, అత్యవసర సేవలకు వెళ్లే ప్రజలు ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. బ్రిడ్జి పనుల కారణంగా వారికి అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తుండటంతో సమయం, ఇంధనం రెండూ వృథా అవుతున్నాయని వాపోతున్నారు. ప్రత్యామ్నాయ రోడ్లపై దుమ్ము, ట్రాఫిక్ రద్దీ, ప్రమాదకర మలుపులు మరింత ఇబ్బందిగా మారాయని చెబుతున్నారు.

### ››› పనుల్లో వేగం ఎక్కడ..?

మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో ఆశించిన స్థాయిలో యంత్రాలు, సిబ్బంది కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర పనులుగా ప్రకటించినప్పటికీ పనుల్లో వేగం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఆలోచన కంటే పనులను నెమ్మదిగా సాగనివ్వడంపైనే దృష్టి పెట్టినట్లు కనిపిస్తోందని అంటున్నారు.

### ››› జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ చొరవ తీసుకోవాలని డిమాండ్....

ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే ఆర్అండ్బీ అధికారులతో సమన్వయం చేసి పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయనే విషయంపై అధికారికంగా స్పష్టమైన గడువు ప్రకటించాలని రోజువారీగా పురోగతిని పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అదనపు సిబ్బంది, యంత్రాలతో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. లేదంటే మరో రెండు నెలల పాటు ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.






## యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందొద్దు
- వ్యవసాయ అధికారి అరుణ్ బాబు





**ములకలపల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి):** వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా మండలంలో సమృద్ధిగా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు తెలిపారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం, పొగళ్ళపల్లి రైతు వేదికలో ఏర్పటు చేసిన విత్తన మేళా లో యూరియా బుక్ చేసుకున్న రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 3,154 బస్తాల యూరియాను ఫెర్టిలైజర్ యాప్ ద్వారా పంపిణీ చేయగా, ప్రస్తుతం సొసైటీలో 984 బస్తాలు నిల్వ ఉన్నాయని చెప్పారు. జగన్నాధపురం, పొగళ్లపల్లి, పూసగూడెం రైతు వేదికల ద్వారా కూడా యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఫెర్టిలైజర్ యాప్ ద్వారానే యూరియా బుక్ చేసుకోవాలని, ఇప్పటికే యాప్ ఉపయోగిస్తున్న వారు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని సూచించారు. పంటల అవసరాలకు అనుగుణంగా ప్రతి రెండు రోజులకు ఒకసారి కొత్త యూరియా నిల్వలు అందుబాటులోకి వస్తాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- : సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు



**ములకలపల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి):** గ్రామ పంచాయతీ కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, షూలు, శానిటేషన్ సామగ్రి, ట్రాక్టర్ డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు, పోస్టల్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను వెంటనే కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులపై అధికారులు, రాజకీయ నాయకులు ఒత్తిళ్లు చేస్తే సహించబోమని హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి కనీసం రూ.26 వేల జీతం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వర్క రుక్మధరావు, బోమ్మగాని శంకర్, వగ్గేల ధారయ, కారంపూడి సాయి రత్న, మేకల రమేష్, వెలకం రాఘవులు, వాడే బూజంగరావు, సిద్దుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల హక్కులను హరించే ప్రయత్నాలను అడ్డుకుంటాం

- కొప్పుల రాంబాబు



**ములకలపల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ నాయకులు కొప్పుల రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలం లోని జగన్నాధపురం పంచాయతీ పరిధిలోని నరసాపురం, చింతపేట, నల్లివారిగూడెం, తోగ్గూడెం గ్రామాల్లో బూత్ నంబర్–20 పరిధిలో ఆయన ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో అమాయక గిరిజనులు, పేద ప్రజల ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. తరువాతి సంవత్సరాల జాబితాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ పాత జాబితాను ఆధారంగా చేసుకోవడం వల్ల అనేక మంది అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం విడ్డూరంగా ఉందని, అమాయక ప్రజల ఓటు హక్కులను హరించే ప్రయత్నాలు జరిగితే అఖిల భారత కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టడం తప్పదని హెచ్చరించారు. ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో స్వయంగా పరిశీలించుకోవాలని, అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు, బీఎల్వోలు, కాంగ్రెస్ నాయకులు సున్నం నాగేష్, కూరం రామకృష్ణ, కాటార్పు వెంకట్రావు, ఎస్.కె. జమాల్, వార్డు సభ్యుడు జమిలి ప్రదీప్, సున్నం రాజు తదితరులు పాల్గొన్నారు.



## బీఎల్ఏలు ప్రజలను చైతన్యవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ మండల కోఆర్డినేటర్ సురభి రాజేష్



**ములకలపల్లి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** మండలంలోని సీతాయిగూడెం గ్రామంలోని బూత్ నంబర్లు 21, 22లో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని సర్పంచ్ కారం చంద్రకళ సుధీర్ కుమార్‌తో కలిసి మండల కాంగ్రెస్ బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలు ప్రతి ఓటరికి అందేలా బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో అవగాహన కల్పించాలని, నింపిన ఫారాలను తిరిగి బీఎల్‌వోలకు అందజేసే వరకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు కే. రాజేశ్వరి, డి. నాగేశ్వరమ్మ, ఉమ్మడి జగన్నాథపురం బీఎల్ఏ అబ్జర్వర్ గుంటూరు సాయి, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడిమె వంశీ, స్థానిక కాంగ్రెస్ నాయకుడు వాడేలి పరమేష్, వార్డు సభ్యులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో రాష్ట్ర సోషల్ ఆడిట్ తనిఖీలు

- వసతులు, నిధుల వినియోగం, విద్యా ప్రమాణాలపై సమగ్ర పరిశీలన
- ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి.. పలు అంశాలపై అభిప్రాయాల సేకరణ






**అన్నపురెడ్డిపల్లి, జూన్ 29 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్ బృందం సోమవారం సామాజిక తనిఖీలు నిర్వహించింది. జూన్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేపడుతున్న సోషల్ ఆడిట్‌లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి ఎప్సిబా తెలిపారు. రాష్ట్ర సోషల్ ఆడిట్ బృంద సభ్యురాలు సత్యలలిత, స్థానిక సామాజిక తనిఖీ సభ్యులు, ఎంపిక చేసిన కమిటీ సభ్యులతో కలిసి పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, విద్యార్థినుల వసతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, పాఠశాల నిధుల వినియోగం, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి పలు అంశాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. తనిఖీల్లో నమోదు చేసిన వివరాలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు సమర్పించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంగోతు వెంకటేశ్వరరావు, విశ్రాంత ప్రాంతీయ గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి షేక్ బురాన్, అన్నపురెడ్డిపల్లి గ్రామ ఉప సర్పంచ్ మారగాని అశోక్, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి విషయంలో తగ్గేదేలే..

- ప్రజాసేవలో నాడు భర్త, నేడు భార్య.
- ప్రజాసేవలో లక్ష్మీదేవి పల్లికి కొత్త గుర్తింపు.
- ఒకే కుటుంబం నుంచి కార్పొరేటర్, మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్.
- అభివృద్ధి, ప్రజాసేవకు చిరునామాగా నిలుస్తున్న భూక్యా కుటుంబం.







**పాల్వంచ, జూన్ 29, ప్రజాజ్యోతి:** రాజకీయాలను అధికారానికి కాదు ప్రజాసేవకు వేదికగా మలుచుకుంటే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవవచ్చని పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ నిరూపిస్తోంది. గత ఎన్నికలలో సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి పునాది వేసిన భూక్యా విజయ్ కుమార్ బాటలో, నేడు ఆయన సతీమణి భూక్యా మంజుల అదే సేవా స్ఫూర్తితో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నారు. ఒకే కుటుంబం నుంచి కార్పొరేటర్, మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ ప్రజా ప్రతినిధులుగా సేవలందిస్తుండటంతో ఆ కుటుంబం ప్రజాసేవకు ప్రతీకగా నిలుస్తోంది.2019 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో లక్ష్మీదేవిపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన భూక్యా విజయ్ కుమార్ తన పదవీకాలంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతర్గత రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదల, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించి గ్రామ ప్రజల మన్ననలు అందుకున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.2025 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భూక్యా విజయ్ కుమార్ సతీమణి మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో భూక్యా మంజుల సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భర్త ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని. గ్రామంలోని అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సంబంధిత శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**››› పార్టీ ఏదైనా... ప్రజలంతా నావాళ్లే**

ప్రతి కుటుంబాన్ని సమానంగా ఆదరిస్తూ రాజకీయాలకు అతీతంగా సేవలందించడం మంజుల ప్రత్యేకతగా నిలుస్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వెంటనే స్పందించడం వల్ల ఆమెపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతుంది.ఈ కుటుంబంలో మరో కీలక వ్యక్తి భూక్యా విజయ్ కుమార్ సోదరుడు, ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ బీఎస్ రావు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆరో డివిజన్ కార్పొరేటర్‌గా ప్రజలకు సేవలందిస్తూ వైద్య సేవలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలోనూ చురుకుగా వ్యవహరిస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఒకే కుటుంబం నుంచి కార్పొరేటర్, మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ ప్రజాప్రతినిధులుగా కొనసాగుతుండటంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ముందుగా ఈ కుటుంబాన్ని ఆశ్రయిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా స్పందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న ఈ కుటుంబం సేవా దృక్పథంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.డాక్టర్ బీఎస్ రావు, భూక్యా విజయ్ కుమార్, సర్పంచ్ భూక్య మంజుల ముగ్గురూ నిజాయితీ, నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలను కొనసాగిస్తున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండటంతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గ్రామస్థులు మాట్లాడుకుంటున్నారు.అభివృద్ధే లక్ష్యంగా, ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న భూక్యా మంజుల నాయకత్వంలో లక్ష్మీదేవిపల్లి గ్రామం ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. భర్త ప్రారంభించిన అభివృద్ధి ప్రయాణాన్ని భార్య సమర్థవంతంగా కొనసాగిస్తుండగా, అదే కుటుంబానికి చెందిన ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం గ్రామాభివృద్ధికి మరింత బలంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. సేవాభావం, ప్రజలతో మమేకం, అభివృద్ధిపై అంకితభావంతో భూక్యా కుటుంబం ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బసవతారక కాలనీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

- డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన
- బసవతారక కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభం
- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల వివరాలు అందించాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎమ్మెల్యే సూచన





**పాల్వంచ, జూన్ 29, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్వంచ మండలంలో పర్యటించి లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను సందర్శించి పనుల నాణ్యతపై ఆరా తీశారు.అనంతరం బసవతారక కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులై కూడా ఇళ్లు మంజూరు కాని కుటుంబాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం మంజూరు చేస్తున్న అభివృద్ధి పనుల అమలులో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కోరారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా అధ్యక్షుడు షాబీర్ పాషా, పాల్వంచ తహసీల్దార్ దార ప్రసాద్, సర్పంచ్ జర్పుల కాశమ్మ, రూరల్ ఎస్ఐ బాల్దే సురేష్, కొడుపుగంటి శ్రీనివాస్, జర్పుల వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నలిన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చండీ హోమం... రుద్రాభిషేకాలతో మల్లికార్జున ఆలయం భక్తిమయం









- ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని నాగలికి పూజ.. రైతుకు సన్మానం
- వర్షాలు సమృద్ధిగా కురవాలని వాయు శివలింగానికి జలాభిషేకం.. భక్తులకు అన్నదానం

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 29 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారంతో కూడిన పౌర్ణమి పురస్కరించుకుని విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. శివలింగానికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అర్చనలు చేశారు. మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. రోజంతా భక్తుల రాకపోకలతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని నాగలికి ప్రత్యేక పూజలు నిర్వహించి రైతును ఘనంగా సన్మానించారు. అనంతరం చండీ హోమాన్ని వైదిక పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించి లోకక్షేమం, రైతాంగ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్తులు ఆలయంలోని వాయు శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన సేవను హైదరాబాద్–సూర్యాపేటకు చెందిన మద్ద కవిత–మహేష్ దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరీదు కృష్ణయ్య, కృష్ణమ్మ దంపతులు, ఆర్మీ జవాన్ సుభాష్, గ్రామస్తులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర బృందం



**కొత్తగూడెం టౌన్, జూన్ 29 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో హౌస్–టు–హౌస్ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలక అధికారి శ్రీ బ్రహ్మానందరావు సోమవారం పరిశీలించారు. కార్యక్రమం అమలుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని సఫాయి బస్తీ, బొల్లోరిగూడెం, పాల్వంచ ఆర్టీసీ బస్ స్టాండ్, అలాగే అల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుత్తికోయ గిరిజన ఆవాసం ప్రాంతాల్లో హౌస్–టు–హౌస్ సర్వేను పరిశీలించారు. ఇంటి ఇంటికి వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారా లేదా అనే అంశాన్ని యాదృచ్ఛికంగా తనిఖీ చేశారు. ఇళ్లపై చేసిన హౌస్ మార్కింగ్‌లు, సర్వే నిర్వహణ, బృందాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహిస్తున్న తీరుపై రాష్ట్ర పరిశీలక అధికారి బ్రహ్మానందరావు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి, జిల్లా శిశు ఆరోగ్య మరియు రోగనిరోధక టీకాల అధికారి డా. ప్రతాప్, సీహెచ్‌వో శ్రీ నాగభూషణం, సీహెచ్‌వో శ్రీ సోమ్లా నాయక్, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోడు నూతన ఎస్సైగా ఎం. రాజమౌళి బాధ్యతల స్వీకరణ

- శ్రీనివాస్ రెడ్డి నేలకొండపల్లికి బదిలీ




**టేకులపల్లి, జూన్ 29, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని బోడు పోలీస్ స్టేషన్‌కు నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా ఎం. రాజమౌళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు బోడు ఎస్సైగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో రాజమౌళి బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై రాజమౌళి పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పారదర్శకంగా పోలీసింగ్ నిర్వహిస్తామని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సై రాజమౌళికి స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

## సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- నిరసన దీక్షకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం టౌన్, జూన్ 29 ( ప్రజాజ్యోతి )** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అఖిల భారత బొగ్గుగనుల అధికారుల సంఘం (ఐఎంఓఏ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన అధికారుల నిరసన దీక్షను ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అధికారుల పే–రివిజన్, అలవెన్సులు, ఇతర పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సంస్థ లాభాల్లో అధికారులకు తగిన వాటా కల్పించడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి అధికారుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, నాయకులు వంగ వెంకట్, జె. గట్టయ్య, కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ సర్పంచులు





**టేకులపల్లి, జూన్ 29, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవిని సోమవారం కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్ సమక్షంలో మండలంలోని సర్పంచులను నూతన ఎంపీడీఓకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు శాలువాతో శ్రీదేవిని ఘనంగా సన్మానించి, మండల అభివృద్ధి కార్యక్రమాల్లో తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధు లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, స్థానిక పరిపాలన బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు సర్పంచులు చొరవ చూపాలని కోరారు. గ్రామీణాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, కాంగ్రెస్ పార్టీనాయకులు ఈది గణేష్, పోశాలు, భద్రు, సుధాకర్, నగేష్, సుఖ్య, బన్సీలాల్, కోటి, శంకర్ తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

- నిశ్శబ్దం వీడిన సింగరేణి అధికారులు..
- చరిత్రలో తొలిసారిగా రిలే నిరాహార దీక్షలు...
- పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ, పదోన్నతుల కోసం పోరు
- కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపిన అధికారులే నేడు తమ సమస్యలపై ఉద్యమబాట...
- యాజమాన్యం వైఖరిపై పెరుగుతున్న అసంతృప్తి..
- మద్దతు పలికిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమెల్యే కూనంనేని సాంబశివరావు

# తాడోపేడో తేల్చుకోవాల్సిందే..!



**137 ఏళ్ళ సింగరేణి చరిత్రలో కార్మిక ఉద్యమాలు కొత్తకాదు. వేతన ఒప్పందాలు, బోనస్‌లు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల కోసం కార్మిక సంఘాలు ఎన్నోసార్లు ఆందోళనలకు దిగాయి. కానీ సంస్థ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే అధికారులే తమ హక్కుల కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టడం మాత్రం ఇదే తొలిసారి. దీంతో ఈ పరిణామం సింగరేణిలో మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరిపి పరిష్కారానికి వారధిగా నిలిచిన అధికారులే నేడు తమ సమస్యల పరిష్కారం కోసం “తాడోపేడో తేల్చుకోవాల్సిందే..” అన్న రీతిలో సంస్థ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఓఎఐ) అధ్వర్యంలో ఆయా కార్యాలయల ఎదుట నిరాహార దీక్షలకు దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది.**



● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

అయితే ఈ రిలే నిరాహార దీక్షలు సాధారణ నిరసనగా కాకుండా, అధికారుల్లో పేరుకుపోయిన అసంతృప్తికి బహిరంగ రూపంగా కనిపిస్తున్నాయి. సంస్థ అభివృద్ధిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తమ సమస్యలను ఇటు యాజమాన్యం, అటు ప్రభుత్వం పదే పదే విస్మరిస్తోందనే భావన అధికారుల్లో బలపడుతుండటంతోనే ఈ స్థాయి ఆందోళనకు పరిస్థితులు దారితీశాయని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ దీక్షకు ప్రస్తుత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమెల్యే కూనంనేని సాంబశివరావు కార్పోరేట్ ఏరియా లోని దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం పలకడం ఉద్యమంలో మరో కీలక పరిణామంగా మారింది.

### ››› అసలు సమస్య ఏమిటి..?

సింగరేణిలో కార్మికులకు జేబీసీసీఐ ద్వారా ఐదేళ్లకోసారి వేతన సవరణ అమలవుతుండగా, అధికారులకు మాత్రం పదేళ్లకోసారి మాత్రమే వేతన సవరణ వర్తిస్తోంది. దీంతో కాలక్రమేణా వేతనాల్లో అసమానతలు ఏర్పడి, కొన్ని విభాగాల్లో ఉన్నత బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల కంటే కొందరు కార్మికులే అధిక వేతనాలు పొందుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో పాటు ఎన్సిడబ్ల్యూఏ ఉద్యోగుల ఏ గ్రేడే వేతనం ఈ1 గ్రేడ్ అధికారుల వేతనం కంటే ఎక్కువ ఉండకూడదని సి ఐ ఎల్ నిభందనలు ఉన్నాయి. కాని సింగరేణిలో ఈ రెండిటి మధ్య వ్యత్యాసం ఉంది. అందుకే కోల్ ఇండియా విధానానికి అనుగుణంగా ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దేందుకు అధికారులు 2023 ఆగస్ట్ లో కోర్టును సైతం ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా పే అప్‌గ్రేడేషన్ 2023 నాటి నుండే అమలు చేయాలని 2025 పేర్కొంది. దీంతో ఈ అములుకు అధికారులు చాలా కాలంగా యాజమాన్ని కోరుతున్నారు. దీనికి తోడు అధికారులకు వెతనలో భాగమైన పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) చెల్లింపులు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండడం, పదోన్నతుల్లో జాప్యం కొనసాగుతుండటంతో అధికారుల్లో అసంతృప్తి పెరిగి, చివరకు సింగరేణి చరిత్రలో తొలిసారిగా రిలే నిరాహార దీక్షలకు దారితీసింది.

### ››› పేరుకుపోయిన అసంతృప్తి..

ఈ ఉద్యమం ఒక్కరోజులో పుట్టింది కాదు. 2017లో అధికారులకు చివరి సారిగా వేతన సవరణ అమలైన తర్వాత పే అప్‌గ్రేడేషన్ అంశం క్రమంగా పెండింగ్‌లో పడింది. కార్మికులకు జేబీసీసీఐ ద్వారా ఐదేళ్లకోసారి వేతన సవరణ జరుగుతుండగా, అధికారులకు మాత్రం పదేళ్లకోసారి మాత్రమే వేతన సవరణ ఉంటుంది. ఈ వ్యవస్థ కారణంగా కాలక్రమేణా వేతనాల్లో అసమానత పెరిగిందని అధికారుల సంఘం వాదిస్తోంది. కొన్ని విభాగాల్లో ఉన్నత బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల కంటే కొన్ని గ్రేడ్‌ల కార్మికులే అధిక వేతనం పొందుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయని వారు పేర్కొంటున్నారు. కోల్ ఇండియా విధానంలో సంబంధిత గ్రేడ్ కార్మికుల కంటే అధికారులు తక్కువ వేతనం పొందకుండా వేతన నిర్మాణం ఉండాలని స్పష్టమైన సూత్రం ఉన్నప్పటికీ, సింగరేణిలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అధికారులు ఆరోపిస్తున్నారు. పే అప్‌గ్రేడేషన్ అమలుపై యాజమాన్యంతో పలు మార్లు చర్చలు జరిగినా స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో అధికారులు 2023లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2025లో వచ్చిన తీర్పు అనంతరం 2023 నుంచి పే అప్‌గ్రేడేషన్ అమలుకు అవకాశం ఏర్పడిందని సంఘం చెబుతోంది. అయినప్పటికీ అమలు విషయంలో జాప్యం కొనసాగుతుండటమే అసంతృప్తికి ప్రధాన కారణంగా మారిందని పేర్కొంటున్నారు. "న్యాయపరంగా మార్గం సుగమమైనా, పరిపాలనా నిర్ణయం లేకపోవడం వల్లే ఉద్యమం వరకు రావాల్సి వచ్చింది" అని అధికారుల వర్గాలు చెబుతున్నాయి. పే అప్‌గ్రేడేషన్‌తో పాటు పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పిఆర్పి) అంశం కూడా ఉద్యమానికి కీలక కారణంగా మారింది. 2022-23, 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పీఆర్‌పీ ఇప్పటికీ చెల్లించలేదని అధికారులు ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్లుగా సింగరేణి వేల కోట్ల రూపాయల లాభాలు నమోదు చేస్తూ దేశంలోనే లాభదాయక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిచినా, ఆ విజయాల్లో కీలక పాత్ర పోషించిన అధికారులకు రావాల్సిన ప్రోత్సాహకాలు నిలిచిపోవడం సమంజసం కాదని వారు అంటున్నారు. ఉత్పత్తి పెంపు, కొత్త గనుల అభివృద్ధి, సాంకేతిక ఆధునికీకరణ, వ్యయ నియంత్రణ వంటి ప్రతి కీలక కార్యక్రమంలో అధికారులు ప్రధాన బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, సేవలకు తగిన గుర్తింపు దక్కడం లేదనే భావన వారిలో బలపడింది. వేతనాలతో పాటు పదోన్నతుల వ్యవస్థ కూడా అధికారుల్లో అసంతృప్తికి కారణమైంది. ఖాళీలు ఉన్నా పదోన్నతులు ఆలస్యమవుతున్నాయని, పారదర్శక విధానం లేకపోవడంతో అనేక మంది అధికారులు ఒకే హోదాలో సంవత్సరాల తరబడి కొనసాగాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. దీనివల్ల కెరీర్ పురోగతి దెబ్బతినడంతో పాటు యువ అధికారుల్లో నిరుత్సాహం పెరుగుతోందని పేర్కొంటున్నారు.




### ››› ఇద్దరు ఐఏఎస్ అధికారులు..?

ప్రస్తుతం సింగరేణి అత్యున్నత యాజమాన్యంలో సిఎండి, డైరెక్టర్ పా స్థానంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సంస్థలో ఇంత ఉన్నత స్థాయి పరిపాలన ఉన్నప్పటికీ అధికారుల సమస్యలు రిలే నిరాహార దీక్షల వరకు రావడం సంస్థలో చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ ఉద్యమంలో ఎక్కువగా వినిపిస్తున్న ప్రశ్న యాజమాన్యం వైఖరిపైనే ఉంది. గతంలో కార్మిక సంఘాలు ఉద్యమాలకు దిగినప్పుడు వెంటనే చర్చలకు పిలిచిన యాజమాన్యం, ఇప్పుడు అధికారులే రిలే నిరాహార దీక్షలు చేపట్టినా అదే స్థాయిలో స్పందించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎట్టాగైన అధికారులు చివరకు వెనక్కి తగ్గుతారనే భావనతోనే యాజమాన్యం ఈ సమస్యలను మరింత కాలం పెండింగ్‌లో ఉంచారా? అనే ప్రశ్నలు సంస్థలో వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న యాజమాన్యం ఉంటే సమస్యలు ఇంత దూరం వెళ్లేవి కావని, ప్రస్తుతం నాన్-లోకల్ యాజమాన్యంతో అధికారుల సమస్యలు ఆశించిన వేగంతో పరిష్కారం కావడం లేదనే అభిప్రాయాలు ఉద్యమంలో పాల్గొంటున్న అధికార వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఇవి అధికారుల వాదనలు మాత్రమే. దీనిపై యాజమాన్యం అధికారికంగా స్పందించాల్సి ఉంది. వాస్తవానికి సింగరేణి చరిత్రలో అధికారులే ఉద్యమబాట పట్టడం సాధారణ పరిణామం కాదు. అందుకే ఇది కేవలం వేతనాల పెంపు కోసం జరుగుతున్న పోరాటంగా కాకుండా, సేవలకు తగిన గుర్తింపు, ఆత్మగౌరవం, కెరీర్ పురోగతి, పరిపాలనా వ్యవస్థలో అధికారుల పాత్రకు తగిన విలువ కోరుతూ సాగుతున్న ఉద్యమంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం చర్చలకు ముందుకొచ్చి పే అప్‌గ్రేడేషన్, మూడు సంవత్సరాల పీఆర్‌పీ బకాయిలు, పదోన్నతులపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే పరిస్థితులు సద్దుమణిగే అవకాశం ఉంది. లేకపోతే సింగరేణి చరిత్రలో కార్మిక ఉద్యమాల తర్వాత అధికారుల ఉద్యమం కూడా మరో కీలక అధ్యాయంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.